తుంది. ఇక చిన్నపాటి సమస్యలకు వైద్యులతో పనే ముంది.

- కొవిడ్ సమయంలో చాలా పనులు ఆన్‌లైన్‌లో చేయవచ్చనే భరోసా ఏర్పడింది. వాటిలో వైద్యం కూడా ఒకటి. అందుకే కేంద్ర ప్రభుత్వం సైతం ఈ-సంజీవని లాంటి ఆన్‌లైన్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక ప్రాక్టో, 1ఎంజీ లాంటి ప్రైవేట్ సేవలు కూడా వైద్యాన్ని ఆన్‌లైన్‌లోకి తెచ్చేశాయి. మన దేశంలో 2022 నాటికి బిలియన్ డాలర్ల వ్యాపారంగా ఉన్న ఈ టెలిమెడిసిన్ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లు దాటేస్తుందని ఇన్‌సైట్స్ అనే సంస్థ అంచనా వేస్తున్నది. ఇది ఫ్యామిలీ డాక్టర్లకు ప్రత్యక్ష పోటీనే!
- వైద్యం అంటే ఆసుపత్రి, రోగ నిర్ధారణ అంటే పరీక్షలు అనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో ఎటుచూసినా హాస్పిటల్సే కనిపిస్తున్నాయి. వీటి సంఖ్య ఏటా 8 శాతం పెరుగుతున్నట్టు తెలుస్తున్నది.
- సాంకేతికత చాలా వేగంగా మారుతున్నా ఇప్పటికీ చాలామంది ఫ్యామిలీ డాక్టర్లు పాత పద్ధతులనే పాటిస్తున్నారనే అపవాదు ఉంది. కొన్ని క్లినిక్‌లలో కనీస శుభ్రత కూడా ఉండదు. డిజిటల్ థర్మామీటర్లు సైతం కనిపించని ఇలాంటి క్లినిక్‌లకు వెళ్లేందుకు యువతరం అంత ఆసక్తి చూపించదు. అది సహజం.
- ఏటా మన దేశంలో లక్షమంది వైద్య పట్టా పుచ్చుకుంటున్నారని అంచనా. వీరిలో అతి తక్కువ మంది మాత్రమే ఫ్యామిలీ మెడిసిన్ వైపు అడుగులు వేస్తున్నారు. దాంతో ఇప్పటికే ఉన్న వైద్యుల మీద భారం పడుతున్నది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వైద్యుల ముందు జనం బారులు తీరాల్సిన పరిస్థితి. ఇది వైద్యుడి పనివేళల మీద విపరీతమైన ఒత్తిడి తెస్తున్నది. పైగా ఇంజక్షన్ చేయడం దగ్గర నుంచీ శాంపిల్ సేకరణ వరకూ అన్నీ ఒకరే చేయాల్సిన పరిస్థితి ఉంటే ఇక ఆ భారం చెప్పనక్కర్లేదు.

**మార్పులూ రావాలి!**

- ప్రభుత్వాలు... ఫ్యామిలీ డాక్టర్స్ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల అవసరాన్ని పూర్తిగా గుర్తించినట్టు కనిపించదు. ప్రజల ఆరోగ్యం కోసం వారితో కలిసి పనిచేయాలి. సబ్సిడీలు లాంటి సౌకర్యాలు ఇస్తే కాస్త ఊరటగా ఉంటుంది.
- ఫ్యామిలీ క్లినిక్ అంటే పాత, మోటు పద్ధతులు అనే అపవాదును వదులుకోవాలి. డిజిటల్ వస్తువులు, పరిశుభ్రత, ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ లాంటి సదుపాయాలు కల్పిస్తే రోగులకు వెసులుబాటుగా ఉంటుంది.
- ఇతర దేశాలతో పోలిస్తే మన వైద్య సంస్థలు 'ఫ్యామిలీ మెడిసిన్'కి తక్కువ ప్రాధాన్యత ఇస్తాయనీ... జాతీయ స్థాయిలో అందుకు సమగ్రమైన కోర్సులు లేవనే అపవాదు ఉంది. మన వైద్య కోర్సులు ఎక్కువగా ఆసుపత్రులకు లేదా రోగ నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఓ పరిశీలన.
- వైద్యరంగంలో ఎప్పటికప్పుడు అనూహ్యమైన మార్పులు వస్తుంటాయి. సదస్సులు, శిక్షణల ద్వారా ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఫ్యామిలీ డాక్టర్లకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఆ దిశగా ఎంతవరకు చొరవ ఉందన్నది ప్రశ్నార్థకమే!

## 1 డాక్టర్ మీదే టెస్టులు

'డాక్టర్ గారు అసలే చాలా బిజీగా ఉంటారు, పైగా అక్కడ వెయిటింగ్ కూడా ఎక్కువగా ఉంటుంది.... చిన్నచిన్న సమస్యలకు ఆయన్ని కలవకపోవడమే మంచిది' అని చాలామంది రోగులు తమ ఫ్యామిలీ డాక్టర్‌ను కలిసేందుకు ఇష్టపడరట. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధనలో తేలిన విషయం ఇది. నిజానికి చాలాసార్లు చిన్నచిన్న సమస్యలే పెద్ద జబ్బులకు లక్షణాలనీ, కాబట్టి అవసరం అనుకున్నప్పుడు సంశయించక వైద్యుడిని కలవాలని వీరు సూచిస్తున్నారు.

**2** ఒకే ఫ్యామిలీ డాక్టర్‌ని తరచూ కలవడం వల్ల, కొన్నాళ్లకు తనతో ఓ అనుబంధం ఏర్పడుతుందని బ్రిస్టల్ విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన చెబుతున్నది. దీనివల్ల రోగులు తమ అనారోగ్యాలను మరింత స్పష్టంగా చెబుతున్నారనీ, వాటికి మెరుగైన చికిత్స లభిస్తున్నదనీ తెలుస్తున్నది.



### గ్రామీణ భారతానికి రక్ష!

మన దేశంలో ప్రతీ 834 మందికీ ఓ వైద్యుడు ఉన్నాడని గణాంకాలు చెబుతున్నాయి. చాలా దేశాలతో పోలిస్తే ఇది మెరుగైన సంఖ్యే అని ప్రపంచ ఆరోగ్య సంస్థే చెబుతున్నది. కానీ వీళ్లలో ఎక్కువ శాతం నగరాల్లోనే ఉంటున్నారు. పల్లెల్లో ఉంటున్న నాలుగో వంతు మంది వైద్యులకు తోడు, ఆర్ఎంపీలు, ప్రాథమిక ఆరోగ్య నిపుణులే అక్కడి వైద్యానికి కీలకం. 65 శాతం జనాభా గ్రామాల్లోనే ఉండే మన దేశంలో చిన్నాచితకా సమస్యలన్నిటికీ ఫ్యామిలీ డాక్టర్లే సంజీవని. ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలకైనా, కొవిడ్ లాంటి ఉపద్రవాల్లో అయినా ఈ ఫ్యామిలీ డాక్టర్లదే ముఖ్యపాత్ర. మరో విషయం... అపరిశుభ్రత, కలుషిత నీరు లాంటి సమస్యలు అక్షరాస్యత, అవగాహన తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ. వీటి విషయంలో హెచ్చరించే బాధ్యత తీసుకుంటున్నారు అక్కడి వైద్యులు.